క్లుప్తంగా

వాహనాల తనిఖీ



తనిఖీ చేస్తున్న ఎస్సై సతీష్

వాజేడు: మండల పరిధిలోని పెద్దగొల్లగూడెం వద్ద జాతీయ రహదారిపై ఎస్సై జక్కుల సతీష్ ఆధ్వర్యంలో పోలీసులు గురువారం వాహనాలను తనిఖీ చేశారు. రహదారిపై వచ్చి వెళ్లే ప్రతీ వాహనాన్ని సోదాలు చేయడంతో పాటు ప్రయాణికుల వివరాలను అడిగి తెలుసుకున్నారు.

పేదోడి ఇంటి కలను నెరవేర్చిన ప్రభుత్వం

ఏటూరునాగారం: పేదోడి ఇంటి కలను రాష్ట్ర ప్రభుత్వం నెరవేరుస్తుందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చిటమట రఘు అన్నారు. గురువారం మండలంలోని దొడ్లలోని ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి నాయకులు భూమి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో వావిలాల ఎల్లయ్య, చేల వినయ్, వంగపండ్ల రవి, రవీందర్, రాజు, ఎల్లయ్య పాల్గొన్నారు.

సన్మానం

ములుగు రూరల్: జిల్లా మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నియమితులైన రేగ కల్యాణిని గురువారం యూత్ కాంగ్రెస్ పార్టీ నాయకులు జిల్లా కేంద్రంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రాష్ట్ర యూత్ కాంగ్రెస్ కార్యదర్శి సూర్య, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ బానోత్ రవిచందర్ మాట్లాడుతూ.. మార్కెట్ అభివృద్ధి కోసం, రైతుల శ్రేయస్సు కోసం కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వంగ రవి, ఇస్సార్ ఖాన్, మారం సుమన్‌రెడ్డి, నల్లెల భరత్ కుమార్, గోవిందరావుపేట పీఏసీఎస్ చైర్మన్ ఎల్లారెడ్డి తదితరులు ఉన్నారు.

ఉచిత వైద్యశిబిరం

మంగపేట: మండలంలోని బ్రాహ్మణపల్లి, వాగొడ్డుగూడెంలో వనవాసీ కల్యాణ పరిషత్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యుడు అశోక్ బ్రాహ్మణపల్లిలో 56, వాగొడ్డుగూడెంలో 53 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి పలువురికి మందులను పంపిణీ చేశారు. వర్షాకాలంలో వ్యాప్తి చెందే సీజనల్ వ్యాధులు, పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రతపై గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రఖండ ప్రముఖ్ చౌళం సాయిబాబు, ఆశ కార్యకర్తలు సుభద్ర, గ్రామస్తులు సరిత, రమ్య, వరలక్ష్మి, జానకి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం



నగదు అందజేస్తున్న ట్రస్టు సభ్యులు

మంగపేట: మండలంలోని రామచంద్రునిపేటకు చెందిన పిల్లమర్రి సత్యం ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబానికి శ్రీ రామకృష్ణ సేవాట్రస్టు ఆధ్వర్యంలో గురువారం ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు ఇందారపు రమేష్, నాగరాజు, జగదీష్, వీరస్వామి, సాయి, సదీప్, కీర్తివరుణ్, గణేష్, రామకృష్ణ, మనోజ్, సిద్ధు, రాకేశ్ పాల్గొన్నారు.

కేసు నమోదు

రేగొండ: విధి నిర్వహణలో ఉన్న నీటిపారుదల శాఖ లష్కర్‌పై దాడి చేసిన వ్యక్తిపై గురువారం కేసు నమోదైంది. ఎస్సై సందీప్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గంగిరేణికుంటలో అధికారుల అనుమతితో ఇందిరమ్మ ఇళ్లకు మొరం తరలిస్తున్నారు. ఈ సందర్భంగా పరిశీలనకు వెళ్లిన లష్కర్ కొటం శంకర్‌పై రేగొండ మండల కేంద్రానికి చెందిన మేకల రవికుమార్ అనే వ్యక్తి కర్రలతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. కాగా, బాధితుడు శంకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

శిథిలావస్థలో మరుగుదొడ్లు



శిథిలావస్థలో ఉన్న మరుగుదొడ్డి



టేకులబోరులో ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు

- ఇబ్బంది పడుతున్న విద్యార్థులు
- పట్టించుకోని అధికారులు

వెంకటాపురం(కె): మండల పరిధిలోని టేకులబోరు, ఉప్పుడుగొల్లగూడెం ప్రాథమిక పాఠశాలల్లో మరుగుదొడ్లు లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. పాఠశాలల్లో గతంలో నిర్మించిన మరుగుదొడ్డి శిథిలావస్థలో చేరుకున్నాయి. టేకులబోరులో విద్యార్థులు పాఠశాలలో ఓ మూలకు వెళ్లాల్సిన పరిస్థితి. అలాగే ఉప్పుడువిగొల్లగూడెంలో ద్యార్థులు మరుగుదొడ్లు లేక గ్రామ సమీపంలోని చెరువు కట్ట వద్దకు వెళ్తున్నారని స్థానికులు తెలుపుతున్నారు. అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. పాఠశాలలో మరుగుదొడ్లు నిర్మించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

మరుగుదొడ్లు నిర్మించాలి



టేకులబోరు, ఉప్పేడుగొల్లగూడెం ప్రాథమిక పాఠశాలల్లో మరుగుదొడ్లు మరమ్మతులకు గురవడంతో విద్యార్థులు బయటకు వెళ్తున్నారు. అధికారులు స్పందించి మరుగుదొడ్లు మరమ్మతు చేయడం లేదా కొత్తవి నిర్మించి విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూడాలి.

-సతీష్, ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా కన్వీనర్

మరమ్మతు చేయాలి



పాఠశాలలో మరుగుదొడ్లు మరమ్మతుకు గురయ్యాయి. దీంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి పాఠశాలలో మరుగుదొడ్లు మరమ్మతులు చేయించాలి.

- రమేశ్, విద్యార్థి తండ్రి, ఉప్పడుగొల్లగూడెం

ఇళ్ల నిర్మాణాలను సకాలంలో పూర్తి చేయాలి

- ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీకాంత్ నాయుడు



మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీకాంత్‌నాయుడు

వాజేడు: ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు సకాలంలో నిర్మాణాలను పూర్తి చేయాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీకాంత్ నాయుడు అన్నారు. మండల పరిధిలోని మొరుమూరు గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో లబ్ధిదారులతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఇళ్లు మంజూరైన వారు నిర్మాణ పనులను వెంటనే చేపట్టాలన్నారు. ఇళ్లు ప్రారంభించడానికి నిధులు లేని వారు సమాచారం ఇస్తే లబ్ధిదారులకు కాంట్రాక్టర్‌ను ఏర్పాటు చేస్తామని వారితో మాట్లాడి ఇంటి నిర్మాణం జరుపుకోవాలన్నారు. ఈ సమావేశంలో హౌజింగ్ ఏఈ ఇషాక్ హుస్సేన్, పంచాయతీ కార్యదర్శి కార్తీక్ ఉన్నారు.

గోదావరి వరద పరిశీలన

తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల సరిహద్దు ప్రాంతంలో గోదావరి వరదను ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీకాంత్ నాయుడు గురువారం పరిశీలించారు. టేకులగూడెం గ్రామ పంచాయతీ కార్యదర్శి రవీందర్‌తో కలిసి టేకులగూడెం, కృష్ణాపురం గ్రామ పంచాయతీల పరిధిలో ఉన్న వాగుల వద్ద గోదావరి వరద పరిస్థితిని చూశారు. వరద పెరిగితే చర్యలను చేపట్టాల్సి వస్తుందని ఆలోచనతో పరిశీలించినట్లు తెలిపారు.

పుస్తకాలు, బ్యాగుల పంపిణీ



పుస్తకాలు అందజేస్తున్న సంస్థ సభ్యులు

వెంకటాపురం(కె): మండల పరిధిలోని టేకులబోరు, మంగవాయి, ఆలుబాక, మొర్రవానిగూడెం, రామచంద్రాపురం, ఎదిర గ్రామాల్లోని నిరుపేద విద్యార్థులకు గ్రేస్ సర్వీస్ సొసైటీ స్వచ్ఛంధ సేవా సంస్థ ఖమ్మం ఆధ్వర్యంలో పుస్తకాలు, స్కూల్ బ్యాగ్‌లను పంపిణీ చేశారు. దాదాపు 800 మంది విద్యార్థులకు అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు మురళీకృష్ణారెడ్డి, సతీష్, రాజేష్, రజిని, అంజనేయులు, జయరాజ్ ఉన్నారు.

మొక్కల సంరక్షణ అందరి బాధ్యత



మొక్క నాటుతున్న ఎఫ్ఎస్ఓ నాగమణి

వాజేడు: మొక్కల సంసరక్షణ అందరి బాధ్యత అని దూలాపురం ఇన్‌చార్జ్ రేంజర్ బాలకృష్ణ, పూసూరు బీట్ ఎఫ్ఎస్ఓ నాగమణి అన్నారు. వన మహోత్సవంలో భాగంగా గురువారం మండల పరిధిలోని నాగారం, జగన్నాథపురం, మొరుమూరు కాలనీలో పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి మొక్కలను నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అడవుల మూలంగా జీవ కోటికి ప్రాణ వాయువు అందుతుదని ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడాన్ని బాధ్యతగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అటవీ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

గంపోనిగూడెంలో పెసా గ్రామసభ



గ్రామసభ తీర్మానాన్ని వినిపిస్తున్న తహసీల్దార్

మంగపేట: మండల కేంద్రంలోని గంపోనిగూడెం రైతు వేదికలో తహసీల్దార్ రవీందర్ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శి సురేష్ అధ్యక్షతన పెసా గ్రామసభను గురువారం నిర్వహించారు. ఆదివాసీ గిరిజనులకు చెందిన భూములను గిరిజనేతరులు ఆక్రమించుకుని నిబంధనలకు విరుద్ధంగా ప్లాట్లుగా మార్చి ఆయా భూముల్లో అక్రమంగా నిర్మిస్తున్న అంతస్తులు నిలుపుదల చేయాలని తీర్మానం చేశారు. గిరిజనేతరుకుల భూభారతి చట్టం పట్టాలు ఇవ్వొద్దని మరో 22 అంశాలపై పెసా గ్రామసభ ఆమోదం మేరకు తీర్మానం చేశారు. గ్రామసభలో మన్యసీమ పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గొప్ప వీరయ్య, పెసా ఉపాధ్యక్షుడు పూనెం రాములు, కార్యదర్శి ఈసాల సాంబయ్య, గ్రామ పెద్దలు పూనెం సూరయ్య, గాదె సమ్మయ్య, ఎట్టి నర్సయ్య, మహిళా సంఘాల నాయకులు వసంత, సుధారాణి, అనసూయ, రుక్మిణి, నాగమణి, ఆదివాసీ గిరిజ సంఘాల నాయకులు నల్లెబోయిన లక్ష్మణ్‌రావు, పోలెబోయిన ఆదినారాయణ, తోలెం నర్సింహారావు పాల్గొన్నారు.

క్వారీ నిర్వాహకులపై లారీ డ్రైవర్ల ఆగ్రహం

మంగపేట: మండలంలోని మల్లూరు ఇసుక క్వారీకి వచ్చే ఇసుక లారీలు నిలిపేందుకు ప్రత్యేక పార్కింగ్ స్థలాన్ని కేటాయించకుండా ఇబ్బందులు గురిచేస్తున్నారంటూ కొందరు లారీ డ్రైవర్లు గురువారం నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నాలుగు రోజుల నుంచి ఇసుక క్వారీకి వచ్చే లారీలను మల్లూరు హేమాచల క్షేత్రానికి వెళ్లే రోడ్డుపై మళ్లించారు. లారీల రాకపోకలతో మల్లూరు గుట్టకు వెళ్లే బీటీ రోడ్డు, సైడ్‌బర్మ్‌లు పాడైపోతుండతో పాటు గుట్టకు వెళ్లే భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో స్పందించిన ఏటూరునాగారం ఏఎస్పీ లారీలను ప్రత్యేక పార్కింగ్ స్థలాల్లో నిలుపాలని రోడ్డుపై పార్కింగ్ చేస్తే చర్యల తీసుకుంటామని హెచ్చరించారు. అయినా పట్టించుకోక పోవడంతో ఏఎస్పీ ఆదేశాల మేరకు ఎస్సై టీవీఆర్ సూరి తన సిబ్బందితో మల్లూరు గుట్ట, ఏటూరునాగారం–బూర్గంపాడు ప్రధాన రోడ్డుపై నిలిపి ఉంచిన లారీలను వెంటనే తొలిగించేలా చర్యలు తీసుకున్నారు. రోడ్డుపై లారీలను నిలిపితే చట్ట ప్రకారం కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. దీంతో క్వారీ నిర్వాహకులు రోడ్డుపై నిలిపి ఉంచిన లారీలను బోరునర్సాపురం వద్ద బీటీ ప్లాట్ కాళీ ప్రదేశానికి కొన్ని మరికొన్నింటిని క్వారీ రోడ్డుకు పంపించారు. దీంతో బోరునర్సాపురం వద్ద బీటీ ప్లాంట్ వద్ద బురదలో లారీలు దిబడుతుండటం, లారీలను వేరే చోట పార్కింగ్ చేసేందుకు వీలు లేక లారీ డ్రైవర్లు క్వారీ సిబ్బందితో వాగ్వాదాని దిగారు. సీరియల్ పార్కింగ్, లోడింగ్, కాంటా పేరుతో రూ.3,800 వరకు వసూలు చేయడం తప్ప లారీలు నిలిపేందుకు స్థలం కేటాయించకుండగా రోడ్లపై అటూ ఇటూ తిప్పడం ఏంటని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో లారీలను నిలిపేందుకు స్థలం లేక పోవడంతో పోలీసులు అక్కడ నుంచి వెళ్లిపోయిన వెంటనే మళ్లీ గుట్టరోడ్డుపై లారీలను నిలపడం గమనార్హం.

ఘనంగా గురు పౌర్ణమి వేడుకలు



వెంకటాపురం(కె): సాయిబాబా ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



ములుగు రూరల్: గురువులను సన్మానిస్తున్న నాయకులు



ములుగు రూరల్: మాట్లాడుతున్న ప్రధానోపాధ్యాయుడు రాజేందర్



గోవిందరావుపేట: సమ్మక్క సారలమ్మ పూజారి సమ్మయ్యను సన్మానిస్తున్న శిష్యులు

ములుగు రూరల్: జిల్లా కేంద్రంలోని సాయిబాబా ఆలయంలో గురువారం గురు పౌర్ణమి వేడుకలను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమం చేపట్టారు. భక్తులకు ఆలయ వ్యవస్థాపకులు ఆకుల రజిని ప్రవీణ్ కుమార్, జితేంద్ర సాయిలు ఎన్ని ఏర్పాట్లు చేశారు.

బీజేపీ ఆధ్వర్యంలో..

జిల్లా కేంద్రంలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో గురు పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు జిల్లా అధ్యక్షుడు బలరాం మాట్లాడుతూ.. వ్యాస మహర్షి వంటి గురువులు జ్ఞానానికి మార్గం చూపిన మహానుభావులని అన్నారు. వ్యాస పౌర్ణమిని గురు పౌర్ణమిగా పిలువబడుతుందని అన్నారు. సమాజంలో గురువుల స్థానం అత్యంత విశిష్టమైనదని అన్నారు. అనంతరం అత్యాధ్మిక, యోగ గురువులను, వివిధ రంగాలలో సేవలందించిన గురువులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు స్వరూప, రాజ్‌కుమార భాస్కర్‌రెడ్డి, కొత్త సురేందర్, యాదగిరి, రవింద్రాచారి, కృష్ణాకర్, ఇమ్మడి రాకేష్‌యాదవ్, కుమార్, దొంతిరెడ్డి రవిరెడ్డి, జనార్దన్, నాగరాజు, హరీశ్, పాపిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వ్యాస మహర్షిని గురువుగా ఎంచుకోవాలి

ప్రపంచానికి విజ్ఞాన బండాగారాన్ని అందించిన వేదవ్యాస మహర్షిని ప్రతీ విద్యార్థి గురువుగా ఎంచుకోవాలని ప్రభుత్వ బాలుర పాఠశాల ప్రధానోపాధ్యాయుడు క్యాతం రాజేందర్ అన్నారు. గురువారం గురుపౌర్ణమి సందర్భంగా వేద వ్యాస మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేద వ్యాస మహర్షి తెలంగాణలో తపస్సు చేసిన ప్రాంతాన్ని బాసరగా ప్రఖ్యాతి గాంచిందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పిట్టల మల్లయ్య, సిరుప సతీష్, చంద్రమౌళి, జాఫర్ అలీ, మదన్మోహన్, హమీద్, సతీష్, సిబ్బంది బైకాని రజిత, సత్యం పాల్గొన్నారు.

వెంకటాపురం(కె): మండలంలో ఘనంగా గురు పౌర్ణమి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని శివాలయంలో వేం చేసి ఉన్న సాయిబాబా ఆలయం, పెట్రోల్ బంక్ సమీపంలోని సాయిబాబా ఆలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సాయిబాబా భక్త మండలి సభ్యులు మద్దుకూరి నెహ్రూ, కోట మల్లికార్జునరావు, వేల్పూరి లక్ష్మీనారాయణ, జాగర శాంతమూర్తి, సోమయ్య, శ్రీనివాస్, సంతోష్ ఉన్నారు.

గోవిందరావుపేట: మండల పరిధిలోని ఫ్రూట్ ఫాంలో ఏనుగుల సాంబశివరావు, తాటిపెల్లి రాజు ఆధ్వర్యంలో, పస్రా రామాలయంలో బీజేపీ మండల అధ్యక్షుడు మార్క సతీష్ ఆధ్వర్యంలో గురు పౌర్ణమి వేడుకలు నిర్వహించారు. ఫ్రూట్ ఫాంలో సమ్మక్క సారలమ్మ పూజారి ఈసం సమ్మయ్యని, గురువులు డింగిరి రంగాచార్యులు, గురిజాల హనుమంత రెడ్డి, కొమరపాలెం సత్యనారాయణలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో కొత్త సుధాకర్ రెడ్డి, మెరుగు సత్యనారాయణ, కర్ర సాంబశివ రెడ్డి, వలపదాసు రవిశంకర్, బైరి అశోక్, శివసత్తులు కుదురుపాక శంకర్, సతీష్, తారాసింగ్, వసంత, మల్లయ్య, సమ్మయ్య, రాజక్క, సాంబలక్ష్మి, రామారాజు, బుచ్చన్న, రాంచందర్, అంజి, నాగలక్ష్మి, విజయ, లలిత తదితరులు పాల్గొన్నారు.

ఇల్లు కట్టించడం లేదని వృద్ధురాలి ఆత్మహత్య

ములుగు రూరల్: కొడుకులు ఇల్లు కట్టించడం లేదని వృద్ధురాలు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన జేడీ మల్లంపల్లి మండలం చంద్రుతండాలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చంద్రుతండా కు చెందిన గుగులోత్ లక్ష్మి(72)కి ముగ్గురు కుమారులు ఉన్నారు. తల్లికి సొంత ఇల్లు కట్టిస్తామని చెప్పి కాలయాపన చేయడంతో మనస్థాపానికి గురై బుధవారం పురుగుల మందు తాగింది. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ములుగు ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అందించిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎంకు తరలించారు. చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున మృతి చెందినట్లు తెలిపారు. మృతురాలి కుమారుడు రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకటేశ్వర్‌రావు తెలిపారు.

రోగులకు అందుబాటులో ఉండని వైద్యులు

- బీజేపీ నాయకుడు నగరపు రమేష్

ములుగు రూరల్: జిల్లా కేంద్రంలోని ఏరియా ఆస్పత్రిలో రోగులకు రాత్రి సమయంలో వైద్యులు అందుబాటులో ఉండడం లేదని బీజేపీ నాయకుడు నగరపు రమేష్ అన్నారు. గురువారం రాత్రి ఆస్పత్రిలో వైద్యులు లేరనే సమాచారం మేరకు ఆయన సందర్శించి మాట్లాడారు. అంతరాష్ట్రానికి చెందిన రాణి కుమారి రాజేపేటలో రైస్ మిల్లులో దినసరి కూలీగా చేస్తుందని అనారోగ్య సమస్య తలెత్తడంతో స్థానికంగా వైద్యం చేయించి వైద్యుల సూచనల మేరకు ములుగు ఆస్పత్రి తరలించారని తెలిపారు. రాత్రి సమయంలో రాణికుమారికి అనారోగ్య సమస్య తీవ్రతరం కావడంతో వైద్యులు అందుబాటులో లేకపోవడంతో సిబ్బంది వైద్యం అందిస్తున్నారని తెలిపారు. దీంతో గమనించిన వారు ఇచ్చిన సమాచారం మేరకు ఆస్పత్రికి వెళ్లి చూసి మీడియాకు సమాచారం అందించినట్లు తెలిపారు. కాగా, ఆస్పత్రి జౌట్‌పోస్టు పోలీస్ అధికారి సదరు రోగి వద్దకు వెళ్లి పరిస్థితిని అడిగి తెలుసుకురన్నారు. ఏజెన్సీ ప్రాంతానికి పెద్దదిక్కు అయిన ములుగు ఆస్పత్రిలో వైద్యులు ఎమర్జెన్సీ సమయంలో అందుబాటులో లేకపోవడం దారుణమని అన్నారు. వైద్యులు అందుబాటులో లేక పోవడంతో చిన్న చిన్న వాటికి సైతం సిబ్బంది వరంగల్‌కు రెఫర్ చేస్తున్నారని అన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

మొగుళ్లపల్లి: మండలంలోని ఆకినపల్లి గ్రామానికి చెందిన పలువురు బీఆర్ఎస్, బీజేపీ నాయకులు గురువారం కాంగ్రెస్‌లో చేరారు. రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత కటంగూరి రాంనరసింహారెడ్డి ఆధ్వర్యంలో పార్టీలో చేరగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు కండువా కప్పి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో దూడపాక కొమురయ్య, సరిగొమ్ముల సమ్మయ్య, సరిగొమ్ముల రాజేశం, గడ్డం సారయ్యతో పాటు తదితర నాయకులు ఉన్నారు.

ఆగని రేషన్ బియ్యం దందా!

- అర్ధరాత్రి మిల్లులకు తరలింపు
- పట్టించుకోని అధికారులు



కొత్తపల్లిలో అక్రమంగా తరలిస్తుండగా పట్టుకున్న బియ్యం లారీ(ఫైల్)

చిట్యాల: మండలంలో రేషన్ బియ్యం దందా జోరుగా కొనసాగుతోంది. రాష్ట్ర ప్రభుత్వం ఒక్కరికీ ఆరు కిలోల చొప్పున మూడు నెలలు ఒకేసారి బియ్యం ఇచ్చింది. ఇదే అదనుగా భావించిన బియ్యం దళారులు అందినకాడికి సొమ్ము చేసుకుంటున్నారు. రేషన్ కార్డుతో ఇచ్చే సన్నబియ్యం కొంత మంది లబ్ధిదారులు తినకపోవడంతో వారిని గుర్తించేందుకు అక్రమ వ్యాపారులు గ్రామాల్లో కొంత మందిని పైలెట్‌గా పెట్టుకుంటున్నారు. ఆ పైలెట్ గ్రామాల్లో తిరుగుతూ వారిని గుర్తించడంతో పాటు ఎవరైనా నిఘా అధికారులు ఉన్నారా అని ఆరా తీసుకుంటు బియ్యం వ్యాపారికి సమాచారం అందిస్తాంటాడు. అలాగే గ్రామాల్లోని ప్రజల వద్ద ఉన్న సన్న బియ్యం కొనుగోలు చేసేందుకు మధ్య దళారులు కిలోకు రూ.20 చొప్పున తీసుకుని బియ్యం దందా సాగించే వ్యాపారికి అమ్ముతున్నారు. దీంతో ఆ బియ్యం వ్యాపారి గ్రామాల్లో ఉన్న బియ్యాన్ని ఒక చోట సమాకూర్చుకుని వాటిని ఒకేసారి లోడు చేసుకుని అర్ధరాత్రి మిల్లులకు తరలిస్తున్నారు. మండలంలో జోరుగా బియ్యం దందా జరుతుందని అధికారులకు తెలిసిన పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. దళారులు పలువురి అధికారులకు ముడుపులు చెల్లిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి రేషన్ బియ్యం దందాను అరికట్టాలని కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం..



మండలంలోని రేషన్ కార్డు లబ్ధిదారులకు ఇచ్చే సన్న బియ్యం అమ్మినా, దళారులు కొనుగోలు చేసిన కఠిన చర్యలు తీసుకుంటాం. పట్టుబడితే రేషన్ కార్డును తొలగిస్తాం. భవిష్యత్‌లో ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలకు అనర్హులుగా ప్రకటిస్తాం.

- షేక్ ఇమామ్‌బాబా, తహసీల్దార్, చిట్యాల

దిగబడిన ఇసుక లారీలు..



రోడ్డుపై కూరుకుపోయిన ఇసుక లారీలు

వెంకటాపురం(కె): మండల పరిధిలోని యాకన్నగూడెం గ్రామ సమీపంలో గురువారం ఇసుక లారీలు రోడ్డుపై దిగబడ్డాయి. దీంతో సూమారు గంట పాటు ట్రాఫిక్ జామ్ కావడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి ట్రాఫిక్‌ను క్లీయర్ చేశారు.